రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సాప్ ద్వారా పంపగలరు

TGTEL/25/A1964

# తొలి ఆకాంక్ష

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక

రిపోర్టర్లు కావలెను

పాఠమ్యడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతపంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాలో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు | మండల | నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 97 ఎడిటర్ :పెనుగొండ సతీష్ ఆదివారం 23 నవంబర్ 2025 పేజీలు 8 వెల 5.00




# పెన్నే కదాని తృణీకరిస్తే గన్నే కూల్చింది

- కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
- ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు
- చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
- ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
- అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 22 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైం దని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకాకుండా వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచించింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు.అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు.

2లో

- తెలంగాణ పారిశ్రామిక విధానంపై సమగ్ర ప్రకటన
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

## రెండేండ్ల విజయోత్సవాలు ప్రతిబింబించేలా...

## తెలంగాణ రైజింగ్

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 22 : డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్,సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని సీఎం ఆదేశించారు.

2లో

## పార్టీకి తెలియచేసి

# లొంగిపోయాం

- ఇప్పుడున్న స్థితిలో ఇక ఉద్యమించలేం
- ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్న ఆజాద్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబరు 22 : మేం పార్టీకి చెప్పే లొంగిపోయామని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబయ్య అలియాస్ ఆజాద్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తుందని పేర్కొన్నారు. స్టేట్ కమిటీలో ఉన్న

2లో



## ఓట్ చోరీకి వ్యతిరేకంగా డిసెంబర్ 14న

# రామ్‌లీలాలో కాంగ్రెస్ ర్యాలీ

న్యూఢిల్లీ, (నవంబర్ 22) : ఎన్నికలు ఏవైనా ఓట్ల చోరీతోనే బీజేపీ అధికారంలోకి వస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహసిస్తోందని కొద్దికాలంగా ఎడతెగని విమర్శలు కురిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ తన వాదనను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా దేశరాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబర్ 14న భారీ ర్యాలీ నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణను ఈ సభలో హైలైట్ చేయనుంది.

2లో



## సత్యసాయి బోధనలు

# లక్షలాది మందికి మార్గం చూపాయి

2లో

## సున్నం చెరువు పునరుద్ధరణలో

# తొలగిన అడ్డంకి

- ఎఫ్‌టిఎల్‌లో ఉన్న గుడి, ప్రార్థనా స్థలం తరలింపునకు ఓకే

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 22 : హైదరాబాద్‌లోని సున్నం చెరువు పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్న హైడ్రా అధికారులు శనివారం స్థానికులతో కీలక సమావేశం నిర్వహించారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆంజనేయస్వామి గుడి, ముస్లింల ప్రార్థనా స్థలం 'చిల్లా' మార్పు గురించి ఇరుపక్షాల అభిప్రాయాలను హైడ్రా కమిషనర్ స్వయంగా నివాసితులతో మాట్లాడి తెలుసుకున్నారు. చెరువు పునరుజ్జీవనంలో భాగంగా ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలను గట్టు వైపు మార్చాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించగా, రెండు వర్గాల స్థానికులూ ఈ నిర్ణయానికి అంగీకారం తెలిపారు. సున్నం చెరువు కూడా హైడ్రా చేపట్టిన ప్రధాన పునరుద్ధరణ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఉ

2లో




# పెద్దపల్లిలో ఎంపీ గడ్డం పంచాయతీ...

- పెద్దపల్లి జిల్లాకు అసలు ఎంపీ ఉన్నట్టా లేనట్లా...
- ఎంపీ పర్యాటణాల్లో పెద్దపల్లి జిల్లా అధికారుల నిర్లక్ష్యం...
- ఎంపీ స్థాయిని తక్కువ చేసిన వ్యవహారం రామగుండంలో రచ్చ రచ్చ...?
- ఎంపీ వంశీకృష్ణకు సమాచారం ఇవ్వని అధికారుల తీరుపై ప్రజల్లో ఆగ్రహం...

గోదావరిఖని. నవంబర్ 22(ఆకాంక్ష) : ఆయన తాతకు తగిన మనవడు ఎటువంటి రాజకీయ అనుభవం లేదు కానీ రాజకీయాల్లో తాతను మించిపోయి అణతి కాలంలోనే ప్రజల అభిమానాన్ని చురగొన్న నేతగా పేరు సంపాదించాడు. ఇదే కాదు ఆయన తాత ఏలా అయితే కిందిస్థాయి నాయకులకు విలువ ఇచ్చి ఆప్యాయంగా పలకరించేవారు అలాగే ప్రస్తుత ఎంపీ వంశీకృష్ణ, కాక మనవడిగా రాజకీయ అరంగేట్రం చేసి మొదటి ప్రయత్నంలోనే ఎంతోమంది ప్రజల అభిమానంతో

2లో

## రూ.5 లక్షల కోట్ల విలువైన భూమిని రూ.4,500 కోట్లకే

# విక్రయించాలని చూస్తున్నారు



- రూ.4 లక్షల 95 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారని ఆరోపణ
- విక్రయానికి పెట్టిన భూమి 4,740 ఎకరాలు కాదని, 9,298 ఎకరాలు అన్న హరీశ్ రావు
- పరిశ్రమలకు ఇచ్చిన భూములను బహుళ అవసరాలకు ఎలా వినియోగిస్తారని ప్రశ్న

తెలంగాణ (నవంబర్ 22) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5 లక్షల కోట్ల విలువైన 9,298 ఎకరాల భూమిని రూ.4,500 కోట్లకు విక్రయించాలని

2లో

## ఎంబీఏ ఫలితాలు విడుదల

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబరు 22 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.



# ఏపీకి వర్ష సూచన.. వారం రోజుల్లో

అమరావతి, (నవంబర్ 22) : ఇటీవల మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. అనేక జిల్లాల్లో వర్ష బీభత్సం కొనసాగింది. ఆ పరిస్థితులను నుంచి ప్రజలు కోలుకుంటున్న తరుణంలో మరోసారి వర్షాలు ఏపీని ముంచెత్తనున్నాయి. ఉపరితల ఆవర్తన ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది పశ్చిమ – వాయవ్య దిశగా కదులుతూ

2లో

# పెన్నే కదాని తృణీకరిస్తే గన్నై కూల్చింది

మొదటిపేజీ తరువాయి

కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు. ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రానిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

## రెండేండ్ల విజయోత్సవాలు ప్రతిబించేలా.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంతో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలకంగా పాలుపంచుకోవాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశిరచుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. అభివృద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాలుపంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్ కు తుదిరూపం ఇస్తామని అభిప్రాయపడ్డారు.

## రూ.5 లక్షల కోట్ల విలువైన భూమిని రూ.4,500 కోట్లకే విక్రయించాలని చూస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

చూస్తున్నారని, దీని ద్వారా రూ.4 లక్షల 95 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. విక్రయానికి పెట్టిన భూమి 4,740 ఎకరాలు మాత్రమేనని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని, కానీ వాస్తవానికి ఆ భూమి 9,298 ఎకరాలుగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రికి సవాల్ విసిరారు.

పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఆజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు అధికంగా వసూలు చేయాలని చట్టం చేశామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే భూములను అప్పగించాలని చూస్తోందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5 లక్షల కోట్లు రావాల్సిన భూములకు రూ.5 వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయని ప్రశ్నించారు. రెండు సంవత్సరాల బడ్జెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని అన్నారు. మంత్రి మండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారని నిలదీశారు. ఈ భూములను వేలం వేస్తే రూ.5 లక్షల కోట్లు వస్తాయని ఆయన అన్నారు. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తారని నిలదీశారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు పంపించాలని నిర్ణయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా పంపిస్తోందని ఆరోపించారు. పరిశ్రమలకు ఇచ్చిన భూములను బహుళ అవసరాలకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు.

## ఓట్ చోరీకి వ్యతిరేకంగా డిసెంబర్ 14న రామ్‌లీలాలో కాంగ్రెస్ ర్యాలీ

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఈ ర్యాలీలో పాల్గొంటారు. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారతదేశ ప్రజాస్వామ్యాన్ని విడిపించేందుకు జరుపుతున్న పోరాటానికి ఇది ఆరంభమని కాంగ్రెస్ చెబుతోంది. కాంగ్రెస్ 'మహా ర్యాలీ' వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వివరిస్తూ, డిసెంబర్ 14వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇవాళ ప్రజాస్వామ్యాన్ని కమ్మేస్తున్న అతిపెద్ద ప్రమాదం ఓట్ చోరీ అని, దేశ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా రామ్‌లీలానుంచి గట్టి సందేశాన్ని ప్రజల్లోకి పంపుతా మని తెలిపారు.

బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, పెద్ద ఎత్తున ఎన్నికల జాబితాల్లో అవకతవకలకు పాల్పడటం వంటి దుష్ట పన్నాగాలకు బీజేపీ-ఈసీఐ పాల్పడుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కోట్లాది మంది సంతకాలు మాకు అందాయి. నిబంధనలను ఈసీఐ ఏవిధంగా తుంగలో తొక్కుతోందో, ఎంసీసీ ఉల్లంఘనలను బేఖాతరు చేస్తోందో, పట్టపగలే డబ్బులు పంచుతూ బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతుంటే ఏవిధంగా సహకరిస్తోందో ప్రజలందరికీ తెలుసు' అని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ఇప్పుడు వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ ఎన్నికల వ్యవస్థను కళ్లముందే ధ్వంసం చేస్తుంటే తాము చూస్తూ ఊరుకోలేమని చెప్పారు. బిహార్ ఎన్నికల ఫలితాల అనంతరం జరిపిన సమీక్షా సమావేశంలోనే ఓట్ చోరీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించాలనే నిర్ణయం కాంగ్రెస్ పార్టీ తీసుకుందన్నారు. బీహార్ ఫలితాలకు ఓట్ చోరీనే కారణమన్నారు. ఇందుకు ప్రధాని, హోం మంత్రి, ఎన్నికల కమిషన్ కలిసి భారీ వ్యూహం పన్నాయని ఆరోపించారు. కాగా, ఓట్ చోరీపై రాహుల్ గాంధీ గత ఆగస్టులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానంతరం కాంగ్రెస్ పార్టీ సెప్టెంబర్ నుంచి సంతకాల ఉద్యమం ప్రారంభించింది. కర్ణాటక కాంగ్రెస్ 1.12 కోట్ల సంతకాలు సేకరించగా, పంజాబ్‌యూనిట్ 27లక్షలసంతకాలను సేకరించి పార్టీ అధిష్టానానికి అందజేసింది. ఇతర రాష్ట్రాల్లో సైతం కాంగ్రెస్ విభాగాలు సంతకాల సేకరణ జరిపాయి.

# పెద్దపల్లిలో ఎంపీ గడ్డం పంచాయతీ...



మొదటిపేజీ తరువాయి

ఎంపీగా గెలిచి తాత వ్యవహరించిన విధంగానే ఆయన గెలుపు కోసం పార్టీ కోసం కష్టపడిన నేతలను నాయకులను వదిలిపెట్టకుండా నిరంతరం వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ గెలిపించిన ప్రజల అభిమానాన్ని ఆప్యాయతను పంచుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వంశీకృష్ణ చేస్తున్న ప్రయత్నాలు కృషి ఎనలేనిదని ప్రజలు కొనియాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక ఎంపీగా అధికారులు తనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకుండా కనీస ప్రోటోకాల్ ను పాటించకుండా ప్రతిసారి కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం నాయకుల్లో ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో జరుగుతున్న కార్యక్రమాలు, నిర్మాణాలు, కూల్చివేతలు, అభివృద్ధి పనులుఏవి జరిగినా కూడా పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడికి సమాచారం చేరకపోవడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజలు, స్థానిక నాయకులు, పౌర సంఘాల వర్గాలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయం ప్రకారం, రామగుండంలో అధికారుల తీరు ఎప్పటికీ మారకపోవడం, ఎంపీని పూర్తిగా పక్కనబెట్టి వ్యవహరిస్తున్న విధానం సందేహాలకు తావు ఇస్తోంది. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్నా, అందులో రామగుండం అత్యంత ముఖ్యమైన పారిశ్రామిక కేంద్రం. ఇలాంటి ప్రాంతంలో ఏ పని జరిగినా, ఏ నిర్ణయం తీసుకున్నా, ఏ ప్రాజెక్టులు అమలులో ఉన్నా ప్రజలకు నేరుగా ప్రభావం ఉన్న అంశాల్లో కూడాఎంపీకి సమాచారం ఇవ్వకపోవడం అధికార వ్యవస్థలో ఉన్న గౌరవం, సమన్వయం, పారదర్శకత గురించి ప్రశ్నలను లేవనెత్తుతోంది. స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్న అసంతృప్తి ప్రకారం రామగుండంలో ఎందుకో అధికారులు ఎంపీని పక్కన పెట్టి స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్దపల్లి ఎంపీ ఉన్నాడా లేడా అన్న భావన కలుగుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని పట్టించుకోకపోవడం అవమానకరం" అని అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలి రోజులలో జరిగిన పలు సందర్భాల్లో, రామగుండం పరిధిలో కీలక కార్యక్రమాలు జరుగుతున్నా, ఎంపీ వంశీకృష్ణకు సమాచారం ఇవ్వలేదన్న వార్తలు బయటకు రావడం, ఇదే అనుమానాలను మరింత బలపరిచింది. అధికారులతో పాటు ప్రభుత్వ సంస్థల ప్రముఖ విభాగాల సైతం ఇదే ధోరణిలో వ్యవహరిస్తుండడం మరింత ఆగ్రహానికి దారితీస్తోంది. ఎంపీ వర్గాల సమాచారం ప్రకారం.. రామగుండంలో జరుగుతున్న నిర్లక్ష్యపు వ్యవహారంపై ఎంపీ వంశీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు వర్గాల మాట పార్లమెంటు పరిధిలో ఉన్న ప్రాంతం తన మాట వినడం లేదన్న భావన కూడా ఎంపీకి కలుగుతోందని సమాచారం. ఎంపీ మాట రామగుండంలో చెల్లడం లేదనేది అక్షరసత్యం... అధికారులు ఎవరి మాట వింటున్నారు? ఎవరి ఆదేశాలతో నడుస్తున్నారు. పార్లమెంట్ సభ్యుని పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకు?"అనే ప్రశ్నలు మళ్లీ మళ్లీ వినిపిస్తున్నాయి.

**రామగుండం వంటి పారిశ్రామిక ప్రాంతంలో**

**- ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, నివాసితులు వేలాదిగా ఉన్నారు**

**- ప్రతి పరిపాలనా నిర్ణయం ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతుంది**

**- అయినా ఎంపీకి సమాచారం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య ధిక్కారం అని అభిప్రాయాల వెల్లువ**

ఏది ఏమైనా పెద్దపల్లి ఎంపీకి రామగుండంలో జరుగుతున్న అవమానకర నిర్లక్ష్యం, అధికారులు చూపుతున్న వ్యవహారశైలి, ప్రజల్లో పెరుగుతున్న అసహనం ఇవి అన్నీ కలిసి ఇప్పుడు పెద్ద స్థాయి చర్చగా మారాయి. రామగుండంలో అధికారులు పార్లమెంటు సభ్యునితో సమన్వయం పాటించాలి. ప్రజాప్రతినిధిని గౌరవించాలిప్రజాస్వామ్య విలువలు నిలబెట్టాలి ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే రోజుల్లో దీనిపై రాజకీయ స్పందన, పరిపాలనా మార్పులు, లేదా పైస్థాయి ఆదేశాలు వెలువడతాయా? అన్నది ఆసక్తికర ప్రశ్నగా మారింది.



మొదటిపేజీ తరువాయి

## పుట్టపర్తికి చేరుకున్న రాష్ట్రపతి

### ముర్ముకు ఘనంగా స్వాగతం పలికిన సిఎం, మంత్రులు

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పుట్టపర్తి ఎమ్మెల్యే లు కలిసి రాష్ట్రపతికి సాదర స్వాగతం పలికారు.

## పార్టీకి తెలియచేసి లొంగిపోయాం

మొదటిపేజీ తరువాయి

ఇంకా ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. తామంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయం తీసుకున్నామని దండకారణ్యం స్పెషల్ జోన్ సభ్యుడు ఎర్రా తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యమాన్ని నడిపించడం కష్టమని పేర్కొన్నారు. మా ఆరోగ్య పరిస్థితులు కూడా సహకరించడం లేదని చెప్పారు. మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవడం మంచిదని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యాల సాంబయ్య అలియాస్ ఆజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్రా ఉన్నట్లు డీజీపీ తెలిపారు. మిగతా 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 25 మంది మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు డీజీపీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు నగదుతోపాటు మరికొన్ని వెసులుబాట్లు కూడా కల్పిస్తామని చెప్పారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాసి నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని డీజీపీ తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులు అందరిపైనా కలిపి మొత్తం 1.41 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని వారికే అప్పగిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు ఉన్నారని.. వారు కూడా తొందరగా లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

## సున్నం చెరువు పునరుద్ధరణలో తొలగిన అడ్డంకి

మొదటిపేజీ తరువాయి

న్నందున, చెరువు అసలు పరిమితిని కాపాడటం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, ఆక్రమణలను తొలగించడం వంటి కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ ప్రక్రియలో ఆంజనేయుని గుడి, చిల్లా ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుండటంతో, వాటి పునర్వ్యవస్థీకరణపై గత కొంతకాలంగా సమీక్ష జరుగుతోంది. శనివారం జరిగిన ఈ సమాలోచనలో ఇరువర్గాల నివాసితులు పూర్తిగా సహకరిస్తామని హైడ్రాకు హామీ ఇవ్వడం ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యకు తెరపడింది. పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ముందుకు సాగేందుకు ఈ అంగీకారం ఎంతో సహాయకారి అవుతుందని హైడ్రా అధికారులు తెలిపారు. చెరువు భద్రత, అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో ప్రజల సహకారం అత్యంత కీలకమని కమిషనర్ సమావేశంలో పేర్కొన్నారు.

## ఏపీకి వర్ష సూచన.. వారం రోజుల్లో

మొదటిపేజీ తరువాయి

ఈనెల 24 (సోమవారం) నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**రైతులకు ముఖ్య సూచనలు**

వర్షాలు రానున్న నేపథ్యంలో రైతులకు విపత్తుల నిర్వహణ సంస్థ పలు ముఖ్య సూచనలు చేసింది. ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు వెంటనే కుప్పలు వేసుకోవాలని తెలిపింది. పండిన ధాన్యాన్ని వర్షంలో తడవకుండా సురక్షితంగా భద్రపరచుకోవాలని సూచించింది. ధాన్యం తడిసి రంగు మారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలని పేర్కొంది. తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ సూచనలు చేసింది.

## సత్యసాయి బోధనలు లక్షలాది మందికి మార్గం చూపాయి

శ్రీ సత్యసాయి జిల్లా, (నవంబర్ 22) : పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలు లక్షలాది మందికి మార్గం చూపాయని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. ఇవాళ(శనివారం) బాబా శత జయంతి ఉత్సవాల్లో ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పుట్టపర్తికి వచ్చిన రాష్ట్రపతికి సీఎం, మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమని పేర్కొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని కొనియాడారు. బాబా సందేశంతో కోట్లాదిమంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని కీర్తించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు



# పెద్దపల్లి సాగర్ రోడ్ లో బడిబయట సర్వే...

పెద్దపల్లిటౌన్. నవంబర్ 22((ఆకాంక్ష) : సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆదేశాల మేరకు బడిబయట పిల్లలను గుర్తించుటలో భాగంగా శనివారం పెద్దపల్లి లోని సాగర్ రోడ్ లో సర్వే నిర్వహించినట్లు పెద్దపల్లి క్లస్టర్ సి ఆర్ పి బాలసాని వెంకటేశం తెలిపారు. ఈ నెల 20 నుండి డిసెంబర్ 30 వరకు పెద్దపల్లి పట్టణంలో జరిగే ఇంటింటి సర్వేలో బడి మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించి వారి వివరాలు ప్రబంధ్ పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుంది అని, తద్వారా వచ్చే విద్యా సంవత్సరంలో 6 నుండి 14 సం. వయసు గల వారిని వారి వయస్సుకు తగ్గ తరగతి లో చేర్పించడం తో పాటు 15నుండి 19సం. వయసు గల బడి మానేసిన విద్యార్థులను ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ పరీక్షలు వ్రాయించడం జరుగుతుంది అని పేర్కొన్నారు. కావున పెద్దపల్లి పట్టణ ప్రజలు మీ పిల్లల వివరాలు అందించి సర్వేకు సహకరించాలని కోరారు.

# గురుకుల విద్యార్థిని ఆత్మహత్యపై అనుమానాలు..

## ఆసుపత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన...

ఏలూరు నవంబర్ 22(ఆకాంక్ష) : ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో ఉద్రిక్తత నెలకొంది. అంబేద్కర్ గురుకుల పాఠశాల 10వ తరగతి చదువుతున్న కావ్య నిన్న హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో విద్యార్థిని మృత దేహాన్ని పోస్ట్ మార్టర్ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఆసుపత్రి వద్ద ఈవేళ విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు కావ్య ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు స్కూల్ సిబ్బంది వేధింపులతో తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు దీంతో కొద్దిసేపు ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది కావ్య బంధువులతో తాసిల్దార్. పోలీసులు. మాట్లాడారు విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు..

# చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

## - జడ్జి టి శ్రీనివాసరావు



గోదావరిఖని. నవంబర్ 22(ఆకాంక్ష) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అడిషనల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం గోదావరిఖనిలోని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసూన అధ్యక్షతన న్యాయ సేవాధి కారసంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. నేటి సమాజంలో యువత చెడుమార్గాల బారిన పడుతున్నారని, వాటి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రస్తుతం సెల్ ఫోన్ వాడకం అత్యవసరం తప్ప అనవసర సమయాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారని అందులో వచ్చే మోసపూరిత ప్రకటనలు నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. విద్యార్థులు చదువుకుంటూనే జీవితంలో స్థిరపడే విధంగా లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే గ్రామాల్లో తెలియని వారికి మీరే అవగాహన కల్పించాలన్నారు. వరకట్న సమస్యలు ఎదురుకాకుండా జాగ్రత్త పడాలని ఎలాంటి సమస్యలు ఉన్న న్యాయ సేవ సంస్థ సంప్రదించాలన్నారు. యుక్త వయసులో చెడు మార్గాలు భయభ్రాంతులకు గురికాకుండా జీవితంలో స్థిరపడేందుకు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలని జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికారి సంస్థ పానల్ లాయర్ జి భూమయ్య, న్యాయవాది జె అమరేశ్వర రావు, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# గోదావరిఖని అయ్యప్ప ఆలయం నుండి శబరిమలకు సైకిల్ యాత్ర ప్రారంభం





గోదావరిఖని. నవంబర్ 22(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కాచాపూర్, వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బదుగు అనిల్ అయ్యప్ప మాలను ధరించి గోదావరిఖని అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శబరిమలకు సైకిల్ పై పవిత్ర యాత్రను ప్రారంభించాడు. ఇది అనిల్‌కు నాలుగోసారి అయ్యప్ప మాలా దీక్ష కాగా, గత ఏడాది బైక్ పై శబరి యాత్రను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ తాను ధరించిన మాలా దీక్షకు తమ గురువుగారైన గండు సంజీవ్ గురుస్వామి ఆశీస్సులే కారణమని, ఇటీవలి కాలంలో గురువుగారు పరమపదించారని హృదయ వేదన వ్యక్తం చేశారు. కాచాపూర్ గ్రామంలో ఉన్న అయ్యప్ప దేవాలయ నిర్మాణం సంజీవ్ గురుస్వామి సేవా తపస్సులో భాగమని, ఎన్నో సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి దీక్ష కార్యక్రమాలను నిర్వహించి ప్రజల అభిమానాన్ని పొందిన గురువుగారి ఆత్మకు తాము సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువు సంజీవ్ స్వామి కుమారుడు అబ్బిన్న కడుపున మళ్లీ జన్మించాలని సంకల్పించి, గురువుగారి దివ్య కృపతో, అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ఈ ప్రత్యేక సైకిల్ యాత్రను మొదలుపెట్టినట్లు అనిల్ తెలిపారు. సుమారు రెండువేల కిలోమీటర్లకు పైగా సాగే ఈ యాత్రలో పలు దేవాలయాలను దర్శించుకుంటూ 20 రోజులపాటు కొనసాగుతుందని వివరించారు.యాత్ర ప్రారంభ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవాలయ గురుస్వామి హనుమంతరావు, పెంట రాజేష్, పూజారి రామకృష్ణతో పాటు పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. బదుగు అనిల్ కుమార్‌కు ఆశీర్వచనాలు అందజేస్తూ, యాత్ర విజయవంతం కావాలని భక్తులు ప్రార్థించారు.

# ఓదెల మండలం గుంపుల గ్రామంలో కుప్ప కూలిపోయిన చెక్ డ్యామ్

## - పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి





ఓదెల. నవంబర్ 22(ఆకాంక్ష) :పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మండలం గుంపుల గ్రామ పరిధిలో నిర్మించబడిన చెక్ డ్యామ్ శుక్రవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో కూలి పోవడంతో గ్రామాల్లో ఆందోళన చెలరేగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు, రైతులకు సాగునీటి అవసరాలను తీర్చేందుకు, మానేరునదిపై సుమారు 23 చెక్‌డ్యామ్ లను నిర్మించిన విషయం తెలిసిందే.వాటిలో భాగంగా గుంపుల శంబునిపల్లి గ్రామాల మధ్య నిర్మించబడిన ఈ చెక్‌డ్యామ్ చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు, సాగునీరు అందిస్తూ ఎంతో కీలక పాత్ర పోషించేది.కానీ శుక్రవారం రాత్రి ఈ చెక్‌డ్యామ్‌ను కొంతమంది వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా పేల్చి వేసినట్లుగా కనిపిస్తోందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరిశీలించిన అనంతరం తెలిపారు. ఇలాంటి కార్యాచరణ వెనుక ఇసుక మాఫియా వ్యవహారం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది మంది రైతులు, గ్రామస్తులు ఆధారపడే చెక్‌డ్యామ్‌ను స్వప్రయోజనాల కోసం ధ్వంసం చేయడం అత్యంత నిందనీయమని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆవేదన, అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కూలిపోయిన చెక్‌డ్యామ్‌ను వెంటనే పునర్నిర్మించాలని కూడా మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామస్తులు కూడా తీవ్ర ఆవేదనతో ప్రభుత్వంపై అదే డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో బీఆర్ఎస్ యూత్ మండలం అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ సంపత్, సదారెడ్డి, గోవిందుల ఎల్లస్వామి, చర్లపల్లి సురేష్ గౌడ్, ఉప్పుల శ్రీనివాస్, పర్శరాములు, మద్దిపల్లి కుమార్, బుచ్చయ్య, లింగయ్య, గంధం శ్రీనివాస్, గణేష్, శివ, వెంకన్న, అశోక్, అజయ్, ఇట్యాల శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మాదారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

## - పాలకవర్గం తిరిగి బాధ్యతలు చేపట్టింది

## -బాధ్యతలు చేపట్టిన పిఏసీఎస్ ఛైర్మెన్



పరకాల, నవంబర్22 : తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సముచిత కారణాలు లేకుండా నిరాధార ఆరోపణలతో కక్షపూరితంగా మాదారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్, పాలక వర్గాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన వాదనలను పరిశీలించిన గౌరవ తెలంగాణ హైకోర్టు, ప్రభుత్వం తీసుకున్న రద్దు చర్యను అనర్హమని పేర్కొంటూ, మాదారం సొసైటీ పాలకవర్గాన్ని తిరిగి కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు తీర్పు మేరకు, ఈ రోజు మాదారం సహకార సంఘం ఛైర్మన్‌గా శ్రీ నల్లెల్ల లింగమూర్తి గారు మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు జంగిలి రాజ నర్సయ్య, రావుల విజేందర్ రెడ్డి, కొమ్మిడి రాజిరెడ్డి, దోమ మహేందర్ తదితరులు హాజరయ్యారు. పాలకవర్గం తిరిగి బాధ్యతలు స్వీకరించడంతో సంఘ సభ్యులు, రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



# బావ ఇంటికి కన్నం వేసిన బావమరిది

## -ఆరు నెలల తర్వాత పోలీసుల వలలో నిందితుడు

హన్మకొండ. నవంబర్ 22(ఆకాంక్ష) : హన్మకొండ జిల్లా మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న కుటుంబాంతర దొంగతనానికి పోలీసులు చెక్‌పోస్టు వద్ద చేసిన వాహన తనిఖీలు కీలకంగా మారాయి. వివరాల్లోకి వెళ్తే వాహన తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐలవేని సాయి రోహిత్ (26) ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రారంభ విచారణలో ఎలాంటి అనుమానాస్పద సమాచారం లభించకపోయినా, పోలీసులు లోతుగా ప్రశ్నించగా సాయి రోహిత్ సంచలన విషయాన్ని ఒప్పుకున్నాడు. సుమారు ఆరు నెలల క్రితం తన బావ బూతగడ్డ సతీష్ ఇంట్లో దొంగతనం జరిపినట్టు రోహిత్ అంగీకరించాడు.విశ్వాసం పెట్టిన బంధువే ఇంట్లో కన్నం వేయడం కుటుంబ సభ్యులను షాక్‌కు గురిచేసింది. దొంగతనం సమయంలో ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను రహస్యంగా అపహరించినట్లు నిందితుడు తెలిపాడు. నిందితుడు చూపిన సూచనలు మేరకు పోలీసులు స్వాధీనం చేసిన వస్తువుల విలువ రూ.4.36 లక్షలుగా అంచనా వేశారు. మొత్తం 47.05 గ్రాముల బంగారు నగలను పోలీసులు పక్కా ఆధారాలతో రికవరీ చేశారు. ఈ కేసు విచారణను పర్యవేక్షించిన సీఐ పుల్యాల కిషన్ వివరాలను మీడియాకు వెల్లడించారు. విశ్వాసం, బంధుత్వం, కుటుంబ నమ్మకం అనే మాటలను తుడిచి పెట్టేలా జరిగిన ఈ ఘటన స్థానికుల మధ్య పెద్ద చర్చనీయాంశంగా మారింది. పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించే ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. కుటుంబపరమైన సంబంధాలు, నమ్మకం పేరుతో జరిగే ఇలాంటి నేరాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన లింగాయిపల్లి విద్యార్థి శివ చైతన్య



మెదక్.నవంబర్ 23(ఆకాంక్ష) : మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని శ్యామల హిల్స్ వేదికగా నవంబర్ 18 నుంచి 23 వరకు జరిగిన 52వ రాష్ట్రీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శని %-% 2025లో తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు గర్వకారణంగా నిలిచే ఘన విజయం నమోదైంది. పాపన్నపేట మండలంలోని %గ్రామ% లింగాయిపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి ఏ. శివ చైతన్య గైడ్ ఉపాధ్యాయుడు కిషన్ ప్రసాద్ మార్గ దర్శకత్వంలో రూపొందించిన మిరక్యూలస్ మల్టీపర్పస్ మల్టీ కాన్సెప్ట్వల్ వాహనం అనే వినూత్న ఆవిష్కరణ జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు పొందింది.ప్రమాద నియంత్రణ, భవిష్యత్ రవాణా సాంకేతికత, వ్యవసాయ సమస్యల పరిష్కారం, బహుళ ప్రయోజన వినియోగం వంటి విభిన్న అంశాలను ఏకవాహన రూపకల్పనలో సమన్వయం చేసిన ఈ సాంకేతిక ప్రాజెక్ట్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థి ప్రతిభ, ఆలోచనా పటిమ, సాంకేతిక అవగాహన, సమకాలీన సమస్యలపై దృష్టి పెట్టిన తీరు పరీక్షకులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా పర్యావరణ్ సంస్కృతి సంరక్షణ ఏవమ్ మానవ్ కళ్యాణ్ ట్రస్ట్ ఛైర్మన్ శ్రీ సుశీల్ కుమార్ జాం స్వయంగా శివ చైతన్యకు “యంగ్ సైంటిస్ట్ అవార్డు” అందజేశారు. ఈ పురస్కారం లభించడం విద్యార్థి మాత్రమే కాకుండా పాఠశాల, మండలం, జిల్లా, రాష్ట్రానికి గౌరవకారణమైంది.ప్రదర్శన వేదికపై ఎన్సీఈఆర్టీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, పలువురు ప్రొఫెసర్లు, ఉపన్యాసకులు, జాతీయ స్థాయి విద్యావేత్తలు విద్యార్థి శివ చైతన్యను, గైడ్ ఉపాధ్యాయుడు కిషన్ ప్రసాద్‌ను అభినందిస్తూ ప్రశంసలు కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాలోని విద్యా వర్గాలు, స్థానిక ప్రజలు కూడా ఈ విజయాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకత, విజ్ఞానంపై ఆసక్తి, పరిశోధనా దృక్పథం పెంపొందించడం వంటి అంశాలకు ఈ విజయం దారితీసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. మెదక్ జిల్లా నుంచి జాతీయ వేదికపై ప్రతిభను చాటిన ఈ ఘనత భవిష్యత్తులో మరిన్ని యువ శాస్త్రవేత్తల ఎదుగుదలకు ప్రేరణగా నిలిచేలా కనిపిస్తోంది.

# ఉపాధ్యాయులకు గణితంలోని మెళకువలపై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం





మంథని. నవంబర్ 22(ఆకాంక్ష) : మంథని పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు గణితంలోని మెళకువలపై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంథని మండల విద్యాధికారి దాసరి లక్ష్మీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరు రెండు రోజులుగా జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగ పరచుకొని విద్యార్థులందరికి గణితంలో ముఖ్యంగా రాత లెక్కలలో ప్రావీణ్యం సంపాదించేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాన్ని మంథని మండలంలో అన్ని పాఠశాలల్లో విజయవంతంగా అమలు చేయాలని, తద్వారా విద్యార్థుల ప్రగతిని మెరుగు పరచాలని అన్నారు. అదే విధంగా జిల్లా విద్యా ప్రగతిలో మంథని ప్రథమ స్థానంలో ఉండేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు జరిగిన సమావేశాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, ఈదులపల్లి నరసింహారావు, జె సురేష్ లు ప్రణాళిక బద్ధంగా నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ లు లోకే రాజ్ పవన్, బోగే చంద్రశేఖర్, మద్ది రాము, నారామల్ల లక్ష్మణ్ లు రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు గణితం లో మెలకువలను, అదేవిధంగా రాత లెక్కలను సాధించడంలో నూతన వ్యూహాలను ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు మల్లన్న, రాధికలు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

## - నోటిఫికేషన్ పత్రాల దహనం చేసి నిరసన తెలిపిన సీఐటీయూ




గోదావరిఖని. నవంబర్ 22(ఆకాంక్ష) : కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర బిజెపి ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆర్జీవన్ %+ణఖ-1, 2, 2ూ, 11ూ%, ఇంక్లైన్, ఏరియా వర్క్ షాప్ ప్రాంతాల్లో నోటిఫికేషన్ పత్రాలను దగ్ధం చేశారు. వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రతా కోడ్ (2020), వృత్తిపరమైన భద్రతా, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020)లను నవంబర్ 21, 2025 నుంచి అమలు చేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించాల్సిందేనన్నారు. ఈ సందర్భంగా ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కార్మిక సంక్షేమాన్ని పక్కనబెట్టి బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్లను తెచ్చిందని, ఆత్మనిర్భర్ పేరుతో కార్మిక వ్యతిరేక విధానాలు అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నించడం ధారుణమని విమర్శించారు. 2020 నుంచి దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెలు, నిరసనలు, కోట్లాది కార్మికుల ఆందోళనల్ని పట్టించుకోకుండా కేంద్రం ముందుకు సాగడం ఆందోళనకరమని పేర్కొన్నారు.నవంబర్ 13న ఢిల్లీలో కేంద్ర కార్మిక సంఘాలు లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయాలని చేసిన డిమాండ్లను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం యాజమాన్యాల దోపిడీకి దారితీసే పరిస్థితి ఏర్పడుతుందని మెండె శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సందర్భంలో సింగరేణి యావత్ కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి రాజమౌళి, మేదరి సారయ్య, జెల్ల గజేందర్, పుప్పాల శ్రీనివాసరావు, అనబోయిన శంకరయ్య, వంగల శివరాం రెడ్డి, నంది నారాయణ, ఈదుల సాగర్, పెద్దపల్లి శశికిరణ్, తాళ్లపల్లి శ్రీనివాస్, మహేందర్, మేదరి కుమార్, జనార్ధన్, భీమా నాయక్, సందీప్, బాదే రవి, సంతోష్, కొమ్మ రమేష్, ఐఎఫ్టియు నాయకులు కృష్ణా, నరేష్, రామకృష్ణ, మల్లేష్, చింతల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకటో తరగతికి పరీక్ష ఫీజు 500 రూపాయల అట...

## 10వ తరగతి పరీక్ష ఫీజు పేరు మీద 2700 రూపాయల వసూళ్లు...

గోదావరిఖని. నవంబర్ 22(ఆకాంక్ష) : ప్రభుత్వం నిర్దేశించిన పరీక్ష ఫీజుల కంటే అదనంగా విద్యార్థుల నుండి వేల రూపాయలను కొన్ని ప్రైవేటు పాఠశాలలు వసూళ్లు చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అయోధ్య నగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల ఒకటో తరగతి విద్యార్థుల నుండి రూ.500 పరీక్ష ఫీజు వసూలు చేయడం స్థానిక తల్లిదండ్రుల్లో ఆగ్రహం రేకెత్తించింది. ఒకటో తరగతికి పరీక్ష ఫీజు అనే పద్ధతి లేదని చెప్పుకుంటూనే, అదే పేరుతో డబ్బులు తీసుకోవడం పాఠశాల యాజమాన్యం తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్నారుల చదువు పేరుతో ఇలాంటి వసూళ్లు చేయడం ఎంతవరకు సముచితం అనే ప్రశ్న గోష పడుతోంది. ఇదే సమయంలో గోదావరిఖని ఎన్టీపీసీ పరిధిలోని మరో ప్రైవేట్ పాఠశాల పదో తరగతి పరీక్షల పేరుతో ప్రతి విద్యార్థి నుండి రూ.2700 వసూలు చేస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ నిర్ణయించిన ఫీజు పరిమితులను పట్టించు కోకుండా, స్వేచ్ఛగా రుసుములు విధించడం విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా పడగొడుతోందని వారు మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలలో ఉచిత పరీక్షలు జరుగుతుండగా, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ భారీ ఫీజులు ఏ ఆధారంపై వసూలు చేస్తున్నారని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే ఈ దోపిడీకి కారణమా? లేక అధికారులకు సమాచారం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారా? అనే అనుమానాలు తల్లిదండ్రులలో వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల విద్య పేరుతో ఆర్థిక భారం మోపే పాఠశాలలకు చెక్ పెట్టే సమయం వచ్చిందని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటం విద్యాశాఖ బాధ్యత అని తల్లిదండ్రులు స్పష్టం చేశారు.

**విద్యాశాఖ అధికారుల తీరుపై అనుమానాలు ఎన్నో...**




గోదావరిఖని పారి శ్రామిక ప్రాంతంలో అనుమతి లేకుండా కొంతమంది పాఠశా లలను నిర్వహించడమే కాకుండా వారి తల్లిదండ్రుల నుండి ఫీజుల పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకునే అధికారులే కరువయ్యారని పలువురు బహిరంగంగా విమర్శ లు చేస్తున్నారు. గోదావరిఖని అయోధ్య నగర్ లో ప్రభుత్వ పాఠశాలకు అతి సమీపంలో ఓ ప్రైవేట్ పాఠశాలలను నెలకొల్పడమే కాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తూ ఒకటవ తరగతికి కూడా 500 రూపాయల పరీక్ష ఫీజును వసూళ్లు చేసిన ఘనత పాఠశాలకే దక్కింది. మరి ఒకటో తరగతి పరీక్ష ఫీజును తీసుకోమని ఏ ప్రభుత్వం ఆ పాఠశాలకు అనుమతి ఇచ్చిందో అర్థం కావడం లేదని కొంత మంది తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరేత్తనట్లు ఉండడం వల్లే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇటువంటి ఆర్థిక దోపిడీ పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి సదురు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అలాగే ప్రైవేట్ పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్న పట్టించు కోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# రామగుండంలో అర్ధరాత్రి కూల్చివేతల దౌర్జన్యం

## - బెదిరింపు రాజకీయాలకు రామగుండంలో ఆటలకు అడ్డుకట్ట

## - ఒక్కొక్కరిగా బయటకు వచ్చి నిలదీస్తున్న వైనం



ఆకాంక్ష ప్రత్యేక ప్రతినిధి : రామగుండంలో గత కొన్ని రోజులుగా కొంతమంది నాయకుల ఆగడాలు మితిమీరిపోతున్న నేపథ్యంలో ప్రజలు నిలదీసే పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. దౌర్జన్యంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ రామగుండంలో రాచరిక పాలన చేస్తున్న నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే పరిస్థితి వస్తున్న నేపథ్యంలో కొంతమంది నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది అనే ప్రచారం జరుగుతుంది. అయినా కొంత మంది నాయకుల్లో మార్పు కనిపించడం లేదనే ప్రచారం జరుగుతుంది. రామగుండం మసీద్ టర్నింగ్ సమీపంలో టీఎస్‌జెన్కో క్వార్టర్స్ విభాగంలో అర్ధరాత్రి వేళ ఉద్రిక్తత చోటుచేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి 1 గంట నుండి తెల్లవారుజాము 3 గంటల మధ్యలో, సంబంధిత అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ స్థానిక నాయకులు, ఓ ప్రముఖ నేత అనుచరులు, అలాగే ఎమ్మెల్యే పీఏగా పిలవబడే మరో ముఖ్య వ్యక్తి ఆధ్వర్యంలో జెసిబి, పొక్లైన్ యంత్రాలను వినియోగించి క్వార్టర్స్ కూల్చివేత పనులు ప్రారంభించారు. అసలు అర్ధరాత్రి కూల్చివేయమని ఏ అధికారులు వారికి ఆదేశాలు ఇచ్చారు. ఇచ్చిన అధికారులు ఎందుకు సమయపాలన పాటించలేదు అనే అంశాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా పగటి పూట నిర్వహించాల్సిన కూల్చి వేతలను అర్ధరాత్రి రహస్యంగా చేపట్టడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్నామని ఏ వేళలోనైనా ఏ చర్య అయినా తీసుకోవచ్చని భావించడం అధికార దుర్వినియోగమని ప్రజలు ధ్వజమెత్తారు. ప్రజలు ఎన్నుకున్న నియోజకవర్గంలో ప్రజల విలువలు, చట్టపరమైన ప్రక్రియలు పాటించాలన్న అంశాన్ని గుర్తు చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజలు తిరగబడే రోజు వస్తే పరిస్థితులు మారిపోతాయని విమర్శకులు హెచ్చరించారు. కూల్చి వేతలను ఆపేందుకు వచ్చిన జెన్కో స్థానిక ఎస్ఈ, భద్రతా సిబ్బందిపై కూడా కాంగ్రెస్ నాయకులు దురుసుగా ప్రవర్తించినట్టు సమాచారం. అధికారులు తమ విధి నిర్వహణలో నిలదీయగా, వారి మీద అనుచిత పదజాలం ఉపయోగించి బెదిరింపులకూ పాల్పడ్డారని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ప్రభుత్వ అధికారం లేని వ్యక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడటంపై అధికారులు ప్రశ్నించగా, వారి జోక్యాన్ని అడ్డుకునే ప్రయత్నం కూడా జరిగినట్లు తెలియవచ్చింది. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. కూల్చివేత వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటి, ఎవరి అనుమతితో చర్యలు జరిగాయి, అధికార పద్ధతులు ఎందుకు పాటించలేదు అనే అంశాలపై స్థానిక ప్రజలు వివరణ కోరుతున్నారు.

# దుబ్బాక నియోజకవర్గం చెరువులలోకి చేప పిల్లల విడుదల కార్య క్రమం హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి



సిద్దిపేట జిల్లా/దుబ్బాక ,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్) : దుబ్బాక నియోజకవర్గంలోని చిట్టాపూర్ గ్రామం పెద్ద చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్మిక మరియు గనుల శాఖ మంత్రివర్యులు డా. వివేక్ వెంకటస్వామి హాజరై చేప పిల్లలను చెరువులో విడిచారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపల పెంపకానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి దృష్ట్యా 100 శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేస్తుండటం గ్రామీణ మత్స్యకారులకు ఆశీర్వాదంగా మారిందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు మత్స్యకారుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. గ్రామ పెద్దలు, మత్స్య సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు భారీగా పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా - చల్లా ధర్మారెడ్డి

పరకాల/నడికుడ,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్): బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు తెలిపారు. శనివారం నడికుడ మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన పార్టీ కార్యకర్తలు దుప్పటి రవి, తాళ్ల మల్లయ్య, తాళ్ల సమ్మయ్య కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో పార్టీ ఎల్లప్పుడూ వారి వెన్నంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే గారి వెంట మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎంపిక

వరంగల్ ,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్): వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓసిటి స్టేడియంలో నిర్వహించిన జూనియర్ బాలికల కబడ్డీ పోటీలలో గీసుగొండ మండలంలోని వంచనగిరి గ్రామానికి చెందిన తెలంగాణ మోడల్ పాఠశాల %ు% కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి. తుల్జారాణి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సునీత విద్యార్థిని తుల్జారాణిని అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాల గౌరవాన్ని పెంచిందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిని అందుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థిని ప్రతిభను వెలికితీసి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు శరత్ ను కూడా ప్రిన్సిపాల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తొర్రూర్ ప్యాక్స్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాకిరాల హరిప్రసాద్



మహబూబాబాద్ /తొర్రూర్ ,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్) :తొర్రూర్ ప్యాక్స్ చైర్మన్‌గా కాకిరాల హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను పదవికి దూరం చేయాలనే ప్రయత్నాలు జరిగినప్పటికీ, న్యాయపరంగా పోరాడి కోర్టు తీర్పుతో మళ్లీ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. తనపై వచ్చిన అన్యాయ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కోర్టు ధిక్కరణ పిటిషన్ కూడా దాఖలు చేసిన తరువాతే పదవి పునరుద్ధరణ జరిగిందని హైలైట్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ హరిప్రసాద్ మాట్లాడుతూ "నేను ప్రజా నాయకుడిని రైతు బిడ్డను. నన్ను అడ్డుకునే ప్రయత్నాలు ఎన్నో జరిగాయి కానీ నేను భయపడలేదు. నాపై నమ్మకం ఉంచి నిలబడ్డ రైతులు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు."అని తెలిపారు. ప్యాక్స్ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం తాను శక్తి వంచన లేకుండా పనిచేస్తానని హరిప్రసాద్ హామీ ఇచ్చారు.



## నవీన్ యాదవ్ గెలుపులో బీసీ రాజ్యాధికార సమితి పాత్ర కీలకం

### –పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నవీన్ యాదవ్ గెలుపులో బీసీ రాజ్యాధికార సమితి నాయకుల కృషి అమూల్యమైనదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణలో బీసీల అభ్యున్నతి, వారి రాజ్యాధికార సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ను ఆయన శనివారం తన నివాసంలో ఆత్మీయంగా అభినందించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ప్రయత్నించినా, కేంద్రం మోకాలడ్డుతూ సహకారం అందించకపోవడం బాధాకరం" అని పేర్కొన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల పెంపుపై నెలకొన్న అనిశ్చిత పరిస్థితులపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. కేంద్ర వైఖరిని బీసీలు అర్థం చేసుకోవాలని పీసీసీ చీఫ్ కోరారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం: మంత్రి సీతక్క



ములుగు జిల్లా టౌన్,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్): ములుగు జిల్లా కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్ర మం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ "మహిళలను గౌరవించే చోట దేవతలు కొలువై ఉంటారు" అని పేర్కొన్నారు. మహిళల గౌరవం, భద్రత, ఆర్థిక శక్తివంతత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**సీతక్క ముఖ్యాంశాలు??**

– మహిళలకు వడ్డీ లేని రుణాలు

– ఇన్సూరెన్స్ సదుపాయాలు

– మహిళా సంఘాలకోసం యూనిఫామ్ (చీరల పంపిణీ)

– మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంపు

సిరిసిల్ల నేతకార్మికులతో ప్రత్యేకంగా నేయించిన ఈ చీరలను, మహిళా సంఘ సభ్యులకు అందజేస్తున్నామని తెలిపారు. "మా లక్ష్యం ం కోటి మహిళలను కోటీశ్వరులుగా చేయడం" %–% సీతక్క ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మహిళలు మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్నారని, ఇంకా మరెన్నో మహిళలను ఈ కుటుంబంలోకి ఆహ్వానించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా మహిళలకు అందించబోయే అవకాశాలు??

– ఫ్రీ బస్సు ప్రయాణం ం బస్సు ఓనర్ షిప్

– పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు

– ఈవెంట్ మేనేజ్‌మెంట్

– 20–25 రకాల వ్యాపారాలకు వడ్డీ లేని రుణాలు

మహిళల మధ్య పరస్పర సహకారం, మానసిక ధైర్యం, ఆర్థిక బలోపేతం పెంచడమే ప్రభుత్వం లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. "మహిళా సంఘం అంటే ం అక్క చెల్లెమ్మల కుటుంబం. ఈ కుటుంబంలో చేరండి ఎదగండి" – సీతక్క

## మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని ప్రారంభించిన వరంగల్ పోలీస్ కమిషనర్



వరంగల్ ,నవంబర్ 22 (ఆకాంక్ష న్యూస్): నేర అన్వేషణలో సాంకేతికతను మరింతగా ఉపయోగిస్తూ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మొబైల్ ఫోరెన్సిక్ సేవలను బలోపేతం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం నూతనంగా అందజేసిన మొబైల్ ఫోరెన్సిక్ రెండవ వాహనాన్ని శనివారం పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ "సంఘటన స్థలంలోనే రక్తమరకలు, వేలిముద్రలు, కీలక సాక్ష్యాలు సేకరించి వాహనంలో ఉన్న ఆధునిక పరికరాలతో వెంటనే ప్రాథమిక పరీక్షలు నిర్వహించే వీలు ఈ సదుపాయంతో కలుగుతుంది. దాంతో విచారణ మరింత వేగవంతం అవుతుంది" అని అన్నారు. వాహనంలో విధులు నిర్వహించేందుకు ఆరుగురు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందిను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, గుణశేఖర్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్, ఏసీపీలు, ఆర్ఐలు, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేత



వర్ధన్నపేట / వరంగల్, నవంబర్ 22 (ఆకాంక్ష న్యూస్): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజున సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే కే. ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని, పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటే కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మహిళ మండల అధ్యక్షురాలు అరుణ, తుల రవి, సాయికుమార్, సమ్మయ్య, డైరెక్టర్ కుమారస్వామి, గడ్డం సమ్మయ్య, ఎలియస్, దశరథం తదితరులు పాల్గొన్నారు.





## పేద ప్రజలకు నాట్కో - ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆర్థిక పునర్వాసం

రంగారెడ్డి జిల్లా/షాద్‌నగర్ ,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్): నందిగామ మండలం చేగురు గ్రామంలో శనివారం జరిగిన ఆర్థిక పునర్వాస కార్యక్రమంలో భాగంగా, గ్రామానికి చెందిన కంచ కృష్ణయ్యకు రూ. 30,000/– ఆర్థిక సహకారంతో చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేశారు. ఈ సహాయం శ్రీమతి ప్రతీప అందించారు. దుకాణాన్ని డాక్టర్ నోయెల్ వేద్ సదన్, సెంటర్ అడ్మిన్ కత్తుల వంశీ, విజన్ సెంటర్ కోఆర్డినేటర్ అంజనేయులు, తెలంగాణ సిబిఆర్ కోఆర్డినేటర్ విలాస్ లోఖండే, జూనియర్ అడ్మినిస్ట్రేటర్ రామకృష్ణ కలిసి ప్రారంభించారు. కంచ కృష్ణయ్య కుటుంబ సభ్యులు శ్రీమతి ప్రతీప, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ మరియు నాట్కో ఐ సెంటర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రకళ, మాజీ సర్పంచ్ అంజమ్మ, ఆశా కార్యకర్తలు శోభ, కృష్ణవేణి, రాజు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ




హన్మకొండ,నవంబర్ 22 (ఆకాంక్ష న్యూస్) : హన్మకొండ హరిత కాకతీయ హోటల్‌లో శనివారం జరిగిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు పాల్గొన్నారు. హసన్పర్తి, ఐనవోలు మండలాలకు చెందిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరలను మహిళలు పొలాల్లో ధరించేవారని, తాను పోలీస్ అధికారిగా ఉండగా ప్రత్యక్షంగా చూసిన విషయమని తెలిపారు. ఇకపై మహిళలు ఇష్టంగా ధరించేలా నాణ్యమైన, ఆకర్షణీయమైన చీరలను "ఇందిరా మహిళా శక్తి" పేరుతో అందిస్తున్నట్టు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మహిళలకు తొలి దశలోనే అమలు చేసిన ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు వంటి హామీలను వరుసగా అమలు చేస్తూ సంక్షేమాన్ని ప్రజలకు చేరవేస్తున్నామని అన్నారు. గత పాలకులు అప్పులతో తెలంగాణను నిండజేశారని, కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని తీవ్రస్థాయిలో విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు కేటీఆర్‌కి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు పెద్ద ఎత్తున పోటీ చేసి నాయకత్వం ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, హసన్పర్తి%–%ఐనవోలు మండలాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.




# పోలీస్ మెగా వైద్య శిబిరం ముగింపు

## - 1,400 మందికి వైద్య పరీక్షలు ,చికిత్సలు..

వరంగల్ ,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్) : పోలీసు సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యుల కోసం రెండు రోజుల పాటు వరంగల్‌లో నిర్వహించిన పోలీస్ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా 1,400 మందికి వైద్య పరీక్షలు, చికిత్సలు అందించినట్లు వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. నవీన్ అడ్వాన్స్ న్యూరోకేర్, భగీరథ కార్డియాక్ కేర్, మేఘన మల్టీ స్పెషాలిటీ, మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో.. పురుషుల్లో 400 మందికి 2%ణ%- ఈసిహెచ్‌ఓ, 400 మందికి ఈసిజీ పరీక్షలు మహిళల్లో 200 మందికి 2%ణ%- ఈసిహెచ్‌ఓ , ఈసిజీ పరీక్షలు 1,400 మందికి మధుమేహ పరీక్షలు. 400 మందికి డయాబెటిక్ న్యూరోపతి స్క్రీనింగ్. 250 మందికి హృదయ సంబంధిత వ్యాధి పరీక్షలు. డాక్టర్ కొరివి నవీన్, డాక్టర్ సంతోష్ మదాని తదితర వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లం అప్పయ్య సందర్శించారు. సుమారు ?5 లక్షల విలువైన మందులు సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, వైద్యులు డా. వెంకటేశ్వర్లు, డా. ప్రియాంక, సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్ ఉప్పు భాస్కర్ రావుతో పాటు అడిషనల్ డీసీపీలు ఎం. సురేష్ కుమార్, బాలస్వామి, వేముల శ్రీనివాస్, రవి, ప్రభాకర్ రావు, ఏసీపీలు జాని నర్సింహులు, సురేందర్, దేవిడ్ రాజ్, జితేందర్ రెడ్డి, నాగయ్య, అనంతయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**ట్రాఫిక్ పోలీసులకు 50 వేల మాస్కులు పంపిణీ**

పొల్యూషన్‌లో నిత్యం శ్రమిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి 50,000 మాస్కులు ఉచితంగా అందించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లం అప్పయ్య, ఫార్మసీ ఆఫీసర్లు ఉప్పు భాస్కర్ రావు, నళిని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అభినందించిన కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ట్రాఫిక్ సిబ్బందిని రక్షించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.

# ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై కార్మికుల సలహాలు తీసుకోవాలి

## - కార్పోరేట్ వైద్యంలో జాప్యం లేకుండా చర్యలు
## - త్వరలో వాట్సాప్ ద్వార కార్మికుల ఫిర్యాదుల స్వీకరణ
## - డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో సిఎండీ ఎన్.బలరామ్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబరు 22 : సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యలపై, సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై కార్మికుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ నిర్ణయించారు. శనివారం ప్రారంభించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. సింగరేణిలోని దాదాపు అన్ని ఏరియాల నుంచి 40 మంది కార్మికులు ఛైర్మన్ కు ఫోన్ చేసి వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ..సింగరేణి కార్మికుల ఫిర్యాదుల స్వీకరణకు, పరిష్కారానికి వీలుగా త్వరలో ఒక వాట్సాప్ నెంబరును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్మికులకు ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేయడానికి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే కార్పోరేట్ ఆసుపత్రులకు వెళ్లిన సమయంలో అనుమతుల జారీ వేగంగా జరిగేలా, వైద్య సేవల విషయంలో జాప్యం లేకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ లో కార్పోరేట్ ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతున్నామని, దీని ద్వారా సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించబోతున్నట్లు తెలిపారు. అలాగే రామగుండం ఏరియాలో క్యాథ్ ల్యాబ్ ను ఏర్పాటు చేసి స్థానికంగా కార్పోరేట్ వైద్య సేవలను అందించనున్నట్లు, త్వరలోనే దీన్ని ప్రారంభించనున్నట్లు సిఎండి వివరించారు.

భూ గర్భ గనుల్లో ఉత్పత్తి పెంపుదలకు తీసుకోవాల్సిన చర్యలపై పలువురు ఉద్యోగులు ఇచ్చిన సూచనలు బాగున్నాయని, వీటిపై సత్వరం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫోన్ లో ఆదేశాలు జారీ చేశారు. ఈపీ-ఫిట్టర్లకు పదోన్నతుల అంశంపైన సంబంధిత అధికారులతో చర్చిస్తామని చెప్పారు. ఉద్యోగుల క్వార్టర్లలో సౌకర్యాల పెంపుదలకు సివిల్ విభాగానికి ఆదేశాలు ఇచ్చారు. మెడికల్ బోర్డును ఈ నెలలో నిర్వహిస్తామని ప్రకటించారు. గైర్హాజరీలు చేసే ఉద్యోగులకు తోటి ఉద్యోగులుగా కౌన్సిలింగ్ ఇవ్వాలని తనకు ఫోన్ చేసిన కార్మికులకు సీఎండీ సూచించారు. సీఎండీతో మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ఉంటుందని తొలుత చెప్పినప్పటికీ కార్మికుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో కార్యక్రమాన్ని 6 గంటల వరకు కొనసాగించడం జరిగింది. కార్యక్రమంలో జీఎం కో-ఆర్డినేషన్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలే ఈ దేశానికి అసలైన నిర్మాతలు - మార్గదర్శకాలు

## - కోటి మహిళలకు కోటి చీరల పంపిణీ ప్రారంభం
## - మహిళా శక్తే రాష్ట్ర ప్రగతికి వేగం : సీఎం రేవంత్ రెడ్డి





వరంగల్/వర్ధన్నపేట ,నవంబర్ 22(ఆకాంక్ష న్యూస్): వర్ధన్నపేట, ఐనవోలు, హసన్‌పర్తి మండలాల్లో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.హనుమకొండలోని డీసీసీబీ సమావేశ మందిరంలో జరిగిన ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అటవీ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల మంత్రి కొండ సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. "మహిళలే జాతి నిర్మాణపు బలమైన పునాదులు" ఎమ్మెల్యే నాగరాజు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ "మహిళలు చదువులో, ఆర్థిక రంగంలో ఎదిగితే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుంది. కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అన్నారు. అలాగే ఆయన పేర్కొంటూ గత ప్రభుత్వంలో వచ్చిన చీరలు ఉపయోగంకాలేదని ఇప్పుడు నాణ్యమైన చీరలు, చేనేత కార్మికులకు ఉపాధి భరోసా లభిస్తోందని తెలిపారు. కేసీఆర్, బీఆర్ఎస్ పై విమర్శలుకల్వకుంట్ల కుటుంబం పది సంవత్సరాలు పాలించిరాష్ట్రాన్ని అప్పుల బారిన పడేశారని విమర్శించారు.కేటీఆర్, కవిత, హరీష్ రావులకు వేల ఎకరాల భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

**మహిళల శ్రేయస్సు కోసం ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

- వడ్డీ లేని రుణాలు- పెట్రోల్ బంకులు, క్యాంటిన్లు నిర్వహణ
- సోలార్ ప్లాంట్‌లలో అవకాశాలు
- ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు
- ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం
- ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరుపై
- రూ. 500కే గ్యాస్ సిలిండర్లు కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కూడా ఛైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు రజిని, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యం

## -రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క- ఇందిరమ్మ చీరల పంపిణీ - మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతీ




ములుగు, నవంబర్ 22 : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని, ప్రతి మహిళ మహిళా సంఘాలలో చేరాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతీఅని, మహిళలు వ్యాపార రంగంలో రాణించడానికి వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. శనివారం ములుగు, వెంకటాపూర్, గోవిందరావు పేట తాడ్వాయి మండలాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లతో కలిసి మంత్రి సీతక్క మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. అనంతరం ములుగు మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 370 సంఘాలకు నలభై ఆరు కోట్ల యాభై లక్షల రూపాయల ఋణాల చెక్కను అందచేయడంతో పాటు 38 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను మంత్రి అందచేశారు. వెంకటాపూర్ మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 195 సంఘాలకు ఇరువై ఆరు కోట్ల యాభై లక్షల రూపాయల ఋణాల పంపిణీ చెక్కను మంత్రి సీతక్క అందచేశారు. వెంకటాపూర్ మండల పరిధిలోని 43 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ/ షాది ముభారక్ చెక్కులను మంత్రి అందచేశారు. గోవిందరావు పేట మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 283 సంఘాలకు ఇరువై తొమ్మిది కోట్ల ఎనబై ఆరు లక్షల యాబై వేల రూపాయల ఋణాల పంపిణీ చెక్కను మంత్రి సీతక్క అందచేశారు.తాడ్వాయి మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 120 సంఘాలకు ఎనిమిది కోట్ల రూపాయల ఋణాల పంపిణీ చెక్కను మంత్రి సీతక్క అందచేశారు. తాడ్వాయి మండల పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ/ షాది ముభారక్ చెక్కులను మంత్రి అందచేశారు. ఈ సందర్భలలో మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళ లేనిదే సృష్టి లేదని, మహిళలు ఎక్కడ పూజిస్తారో అక్కడ దేవతలు వెలుస్తారని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారిని గౌరవించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ ఫలాలను ప్రవేశ పెడుతున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలను ఆహ్వానించడానికి చీరే సారే తో ఆహ్వానం పలుకుతామని అదే తరహాలో సంఘంలో చేర్చడానికి చీరలతో ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులు 25 రకాల వ్యాపారాలు చేసుకోవడానికి వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నామని, మహిళలు సంతోషంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని తెలిపారు. ఆకాశంలో సగభాగం మహిళలే ఉండగా మన నియోజకవర్గాలలో సైతం సగభాగం మహిళలు ఉన్నారని అన్నారు. తనకు సోదరులు ఎవరు లేరని నియోజకవర్గంలోని మహిళలు, పురుషులే అక్క చెల్లెల్ని అన్నదమ్ములని, నియోజకవర్గమే తన కుటుంబమని తెలిపారు. వచ్చే సంవత్సరం మార్చి 8వ తేదీ లోపు ప్రతి మహిళకు చీరలను అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని సీతక్క తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిర మహిళా శక్తి సంఘాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజు నుంచి కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయాలని సంకల్పించుకున్నారని తెలిపారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంఘాలలో మొత్తం 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, రాబోయే రోజుల్లో సంఘాలలో కోటి మందిని పెంచి వారిని కోటీశ్వరులను చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించుకుందని అన్నారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను గౌరవించాలి, మహిళల్ని కాపాడాలి, మహిళలను ఆర్థికంగా ఎదిగించే విధంగా సహాయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇన్సూరెన్సులు, వంటి అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. మహిళా సంఘ సభ్యులను ఎక్కడికి వెళ్లినా గుర్తుపట్టే విధంగా వారికి ప్రత్యేకంగా డ్రెస్ కోడ్ విధానాన్ని ఏర్పాటు చేశామని ఈ నేపథ్యంలోని గత సంవత్సరం నరకాలం పాటు సిరిసిల్ల నేత కార్మికులతో నేయించిన చీరాలను పంపిణీ చేయడం జరుగుతుందని దీని ద్వారా నేత కార్మికులకు కూడా ఉపాధి అందుతుందని అన్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని అదేవిధంగా మహిళా సంఘం సభ్యులకు అదే బస్సులకు యజమానులు కూడా చేసిందని, మహిళలకు పెట్రోల్ బంకులు ఇందిరా శక్తి క్యాంటీన్, వడ్డీ లేని రుణాలు, ఈవెంట్ మేనేజ్మెంట్ ఈ విధంగా సుమారుగా 20 నుంచి 25 రకాల వ్యాపారాలను మహిళలకు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి, పిఎస్ సి ఎస్ చైర్మన్లు సత్తి రెడ్డి, రాములు, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, ఏ పి డి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం



## యువతలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు.. దీనికి ప్రధాన కారణం ఏంటో తెలుసా!

ప్రపంచవ్యాప్తంగా చాలామందిని భయపట్టే ఆరోగ్య సమస్య క్యాన్సర్. ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది క్యాన్సర్ తో మరణిస్తున్నారు. మన శరీరంలోని కణాలు నియంత్రణ లేకుండా పెరగడం, వ్యాప్తి చెందడం వల్ల ఇది వస్తుంది. సాధారణంగా ఒక క్రమబద్ధమైన పద్ధతిలో కణాలు పెరుగుతాయి, చనిపోతాయి. కానీ క్యాన్సర్ లో కణాలు అసాధారణంగా పెరుగుతాయి, చనిపోవు. దీని వల్ల కణితి ఏర్పడుతుంది. ఈ కణితులు శరీరంలోని ఇతర భాగాలకు కూడా వ్యాప్తి చెందగలవు, ఈ ప్రక్రియను మెటాస్టాసిస్ అంటారు. క్యాన్సర్ లో చాలా రకాలు ఉంటాయి. లంగ్ క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ అని చాలా రకాలు ఉంటాయి. అన్ని క్యాన్సర్లలో కేవలం 5-10శాతం మాత్రమే పూర్తిగా వంశపారంపర్యంగా వస్తాయని మిగతావన్నీ పర్యావరణ కారకాల కలయిక వల్ల అభివృద్ధి చెందుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో యువతలో క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అయితే చాలా పెద్ద సీరియస్ ఇష్యూ. దీని వెనుక చాలా కారణాలు ఉన్నప్పటికీ యువత అజాగ్రత్త కూడా కొంత ఉంది. ఈ నిర్లక్ష్యం వారి ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది. దీంతో చాలామంది చిన్న వయస్సులోనే క్యాన్సర్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు.

అన్ని క్యాన్సర్లలో సగం కంటే ఎక్కువ నివారించగలవని పరిశోధకులు భావిస్తున్నారు. పొగాకు వాడకం, ఊబకాయం, మద్యపానం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి కొన్ని జీవనశైలి కారకాలను నివారించడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణాలు బ్యాడ్ ఆహారపు అలవాట్లు చాలామంది యువతీ యువకుల్లో ప్రాసెస్డ్ ఫుడ్ జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, స్వీట్ డ్రింక్స్ వినియోగం పెరుగుతోంది. ఈ ఆహారాలు పోషకాలు లేనివి, హానికరమైన రసాయనాలను కలిగి ఉంటాయి. ఈ రసాయనాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ధూమపానం, మద్యం యువతలో ధూమపానం, మద్యం సేవించడం ఫ్యాషన్ గా మారిపోయింది. నేటి యువతలో ఎక్కువ మంది ధూమపానం చేస్తున్నారు. ఈ అలవాట్లు ఊపిరితిత్తులు, నోరు, గొంతు, కాలేయ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ కారణంగా యువతలో క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి.

శారీరక శ్రమ లేకపోవడం నేటి యువత శారీరక శ్రమల్లో పాల్గొనడం తగ్గిపోతోంది. ఎక్కువ సమయం కంప్యూటర్, మొబైల్, టీవీ ముందు గడుపుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల స్థూలకాయం పెరుగుతుంది..ఇది క్యాన్సర్ కు ప్రధాన కారణం. ఒత్తిడి యువతలో ఒత్తిడి స్థాయి కూడా పెరుగుతోంది. చదువు, కెరీర్, రిలేషన్ షిప్స్ ఒత్తిడి కారణంగా వారి రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. ఎక్కువ ఒత్తిడి తీసుకోవడం చాలా ప్రమాదకరం. అందుకే అప్పుడప్పుడు ట్రీట్మెంట్ లేదా ఏదైనా ఇష్టమైన పనిని చేస్తూ ఉండాలి. సూర్యుని హానికరమైన కిరణాలు సూర్యుని హానికరమైన కిరణాలు చాలా హానికరం. ఇది మీ చర్మాన్ని ప్రభావితం చేస్తుంది. యువత సన్‌స్క్రీన్ వాడటం తక్కువ. సూర్యుని హానికరమైన కిరణాలు చర్మ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే ఇంటి నుంచి బయటకు వెళ్ళే ముందు సన్‌స్క్రీన్ రాసుకోండి.

## ఎండలో వెళ్ళేటప్పుడు ఈ షర్బత్ తాగి వెళితే వడదెబ్బ తగలదు, చర్మం కూడా నల్లగా మారదు.. ఎలా చేసుకోవాలంటే?



వేసవి ఎండలు మండిపోతున్నాయి. బయటికి వెళ్లాలంటే ఎండ వేడిమికి ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. అంత వేడి నుంచి తప్పించుకోవడానికి ప్రజలు చల్ల చల్లని కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్, షర్బత్‌లు తాగుతున్నారు. అయితే అందులో ఎక్కువ మొత్తంలో కెమికల్స్ ఉండే అవకాశం ఉండడంతో చాలా మంది వీటిని తినడానికి అవకాశం ఉండడం లేదు. అయితే ఈ ఎండలో వడదెబ్బ తగలకుండా ఉండడానికి, మంచి ఆరోగ్య ప్రయోజనాలు కలగడానికి చందనంతో చేసుకునే షర్బత్ చాలా ముఖ్యం. దీనిని చాలా సులభంగా, అత్యంత రుచికరంగా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. అయితే ఈ చందనంతో షర్బత్ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

చందనంతో షర్బత్ తయారు చేయడానికి కావలసిన పదార్థాలు: చందనం పొడి - 2 టేబుల్ స్పూన్లు చల్లని నీరు - 2 గ్లాసులు పంచదార లేదా తేనె - రుచికి సరిపడా నిమ్మరసం - 1 టేబుల్ స్పూన్ ఐస్ క్యూబ్స్ - కొన్ని సబ్జా గింజలు (నానబెట్టినవి) - 1 టేబుల్ స్పూన్ (ఐచ్ఛికం).

తయారీ విధానం: ఒక గిన్నెలో చందనం పొడి, పంచదార లేదా తేనె, నిమ్మరసం, నీరు వేసి బాగా కలపాలి. పంచదార లేదా తేనె పూర్తిగా కరిగే వరకు కలపాలి. ఈ మిశ్రమాన్ని వడకట్టండి. గ్లాసులలో ఐస్ క్యూబ్స్ వేసి, చందనం షర్బత్ పోయాలి. నానబెట్టిన సబ్జా గింజలు వేసి బాగా కలపండి. చల్లగా వడ్డించండి.

చందనం షర్బత్ వల్ల ఉపయోగాలు: చందనంతో చేసే షర్బత్ తాగడం అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ షర్బత్ వేసవిలో వడదెబ్బ మరియు నిర్జలీకరణం వంటి సమస్యల నుండి మిమ్మల్ని కాపాడుతుంది. వేసవి కాలంలో ఎక్కువగా జరిగే ఉదర సంబంధిత వ్యాధులను నిరోధించడంలో కూడా ఈ చందనం షర్బత్ ఎంతో సహాయపడుతుంది. అయితే, దీని ఆరోగ్య ప్రయోజనాలను మరింత తెలుసుకుందాం.

వడదెబ్బ మరియు నిర్జలీకరణం నుండి రక్షణ వేసవిలో వడదెబ్బ అనేది అత్యంత తీవ్రమైన సమస్య. దీనిని నివారించడానికి చల్లని ఆహారాలు మరియు కూల్ డ్రింక్స్ చాలా ముఖ్యం. చందనం యొక్క శీతలీకర గుణాలు వడదెబ్బను నివారించడంలో సహాయపడతాయి. జీర్ణక్రియ మెరుగుపరచడం చందనం షర్బత్ తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఎసిడిటీ, అజీర్ణం, చర్మ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. శరీరంలో ఆహారం జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. చర్మం మెరుగుపడుతుంది చందనం షర్బత్‌ను తరచుగా తాగడం వల్ల చర్మం మరింత ఆరోగ్యంగా మారుతుంది. వేడి కారణంగా చర్మం మీద వచ్చే దద్దుర్లు, ఉబ్బలు వంటివి తగ్గుతాయి. అలాగే చర్మం మరింత యవ్వనంగా, మృదువుగా తయారవుతుంది. మానసిక ఒత్తిడి తగ్గించడం చందనం షర్బత్ మనసును ప్రశాంతం చేయడంలో సహాయపడుతుంది. ఒత్తిడి, ఆందోళన, మానసిక అలసట తగ్గుతుంది. మానసిక ఒత్తిడి తగ్గించడం వలన మనిషి ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలాగే ప్రతిపనిలోనూ మంచి విజయాన్ని నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. యూరినరీ సమస్యలు చందనం షర్బత్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ (మూత్రసంచయం సంబంధిత సమస్యలు) తగ్గించడంలో కూడా ఉపశమనం కలిగిస్తుంది. దీని శీతల గుణాలు మూత్రవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి.

## వంకాయతో ఇలా ఎప్పుడైనా ట్రై చేశారా?



వంకాయను సరిగ్గా వాడుకోవాలే కానీ దీంతో బోలెడు వెరైటీలు చేసి ఆస్వాదించవచ్చు. వంకాయను సరైన రీతిలో వండితే దీని టేస్ట్ మరే ఇతర కూరగాయకు ఉండదు. వంకాయ వెరైటీల్లో తందూరి వంకాయ ఒకటి. తందూరి వంకాయ ఒక ప్రసిద్ధ, రుచికరమైన వంటకం. ఇది కాల్చిన వంకాయను వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పెరుగుతో కలిపి తయారుచేస్తారు. తందూరి వంకాయ కేవలం రుచికరమైన వంటకమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. తందూరి వంకాయను ఇంట్లోనే ఈజీగా తారుచేయడం ఎలాగో ఇక్కడ చూడండి.

తందూరి వంకాయ తయారీకి కావలసిన పదార్థాలు పెద్ద వంకాయలు - 2 (గుండ్రంగా లేదా పొడవుగా ఉన్నవి) పెరుగు - 1 కప్పు ఉప్పు- తగినంత కొత్తిమీర- కొద్దిగా నూనె - 2 టేబుల్ స్పూన్లు నిమ్మరసం - 1 టేబుల్ స్పూన్ ధనియాల పొడి - 1 టీ స్పూన్ జీలకర్ర పొడి - 1/2 టీ స్పూన్ పసుపు పొడి - 1/4 టీ స్పూన్ కారం పొడి - 1/2 టీ స్పూన్ గరం మసాలా - 1/4 టీ స్పూన్ చాట్ మసాలా - 1/2 టీ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్

తందూరి వంకాయ తయారీ విధానం -ముందుగా వంకాయలను బాగా కడిగి వాటికి ఆయిల్ రాసి ఒక ఫోర్క్ లేదా కత్తితో అక్కడక్కడా రంధ్రాలు చేయాలి.

-ఇప్పుడు ఓవెన్ ను 200ళీ%జ (400ళీఖీ%) కు ప్రీహీట్ చేయండి. వంకాయలను బేకింగ్ ట్రేలో ఉంచి అవి మెత్తగా మారే వరకు, కొద్దిగా నల్లబడే వరకు 30-40 నిమిషాలు కాల్చండి. మధ్యలో ఒకసారి తిప్పండి. -నేరుగా గ్యాస్ స్టవ్ పై కూడా చేయవచ్చు. గ్యాస్ స్టవ్ మీద వంకాయలను ఉంచి, మంటను మీడియంలో ఉంచండి. వాటిని అన్ని వైపులా తిప్పుతూ నల్లబడి, లోపల మెత్తగా అయ్యే వరకు కాల్చండి. దీనికి 15-20 నిమిషాలు పట్టవచ్చు. -వంకాయలు చల్లారిన తర్వాత వాటిపైన చర్మాన్ని తీసివేయండి. వంకాయ గుజ్జును తీసి ఓ గిన్నెలో వేసి బాగా మెత్తగా మాష్ చేయండి. -తర్వాత ఒక గిన్నెలో పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, పసుపు పొడి, కారం పొడి, గరం మసాలా, చాట్ మసాలా, ఉప్పు వేసి బాగా కలపండి. -తయారుచేసిన మసాలాను వంకాయ గుజ్జులో వేసి బాగా కలపండి. మసాలా వంకాయ గుజ్జుకు బాగా పట్టేలా కలపాలి. -ఒక చిన్న పాన్‌లో నూనె వేడి చేసి అది కాస్త వేడెక్కాక మసాలా కలిపిన వంకాయ గుజ్జును వేసి 2-3 నిమిషాలు తక్కువ మంటపై ఉడికించండి. ఇది రుచిని మరింత పెంచుతుంది. -తందూరి వంకాయను ఒక సర్వింగ్ బౌల్‌లోకి తీసుకోండి. పైన కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేయండి. దీనిని రోటీ, నాన్, పరాటా లేదా అన్నంతో సర్వ్ చేయవచ్చు. ఇది ఒక అద్భుతమైన సైడ్ డిష్ లేదా స్టార్టర్ గా ఉపయోగపడుతుంది.

## అసలు సిసలు పులావ్ అంటే ఇదిరా..



స్వీట్ కార్న్ పులావ్ తయారీకి కావలసిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 1 కప్పు -స్వీట్ కార్న్ గింజలు - 1 కప్పు -ఉల్లిపాయ - 1 - టమోటా - 1 -పచ్చిమిర్చి - 2 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ -నెయ్యి లేదా నూనె - 2 టేబుల్ స్పూన్లు -జీలకర్ర - 1 టీస్పూన్ -ఆవాలు - 1/2 టీస్పూన్. -లవంగాలు - 3-4 - యాలకులు - 2-3 -దాల్చిన చెక్క- చిన్న ముక్క -కరివేపాకు - 1 రెమ్మ -పసుపు పొడి - 1/4 టీస్పూన్ -కారం పొడి - 1/2 టీస్పూన్ -ధనియాల పొడి - 1/2 టీస్పూన్ -గరం మసాలా - 1/4 టీస్పూన్ -ఉప్పు - రుచికి తగినంత -కొత్తిమీర - నిమ్మరసం. స్వీట్ కార్న్ పులావ్ తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా కడిగి 30 నిమిషాలు నీటిలో నానబెట్టండి. -తర్వాత ఉల్లిపాయ, టమోటా, పచ్చిమిర్చిని సన్నగా తరిగి పెట్టుకోండి. -ఇప్పుడు ఒక మందపాటి అడుగు కలిగిన పాన్ లేదా కుక్కర్ లో నెయ్యి లేదా నూనె వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత జీలకర్ర, ఆవాలు,లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేసి కొద్దిగా వేయించండి. తర్వాత కరివేపాకు వేసి వేగనివ్వండి. -ఉల్లిపాయలు లేత గోధుమ రంగు వచ్చే వరకు వేగిన తర్వాత అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించండి. - తర్వాత తరిగిన టమోటాలు, పచ్చిమిర్చి వేసి టమోటాలు మెత్తగా అయ్యే వరకు ఉడికించండి. -తర్వాత పసుపు పొడి, కారం పొడి, ధనియాల పొడి, ఉప్పు వేసి బాగా కలిపి ఒక నిమిషం పాటు వేయించండి. -స్వీట్ కార్న్ గింజలు వేసి 2-3 నిమిషాలు పాటు వేయించండి. -ఇప్పుడు నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేసి మెల్లగా కలపండి. 1-2 నిమిషాలు పాటు వేయించండి. -తర్వాత 1 కప్పు బియ్యానికి 2 కప్పుల నీరు పోయండి. రుచికి తగినంత ఉప్పు వేసి కలపండి. -పాన్ మూత పెట్టి మీడియం మంట మీద నీరు పూర్తిగా ఇంకిపోయే వరకు, బియ్యం మెత్తగా ఉడికే వరకు ఉడికించండి. కుక్కర్ లో అయితే, 2-3 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. -స్టవ్ ఆఫ్ చేసి 5 నిమిషాలు పాటు మూత తీయకుండా అలాగే ఉంచండి. తర్వాత గరం మసాలా, తరిగిన కొత్తిమీర వేసి కలపండి. అంతే స్వీట్ కార్న్ పులావ్ రెడీ. -స్వీట్ కార్న్ పులావ్ ను పెరుగు, రైతా లేదా మీకు నచ్చిన కూరతో వేడిగా వడ్డించండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండుకోవచ్చు.

# సినిమా న్యూస్



## కళాత్మక చిత్రాల దర్శకుడు 'సీతారామం' మాడ్యూల్?



కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఒక చిత్రానికి దర్శకత్వం వహించినా, లేదా నిర్మాతగా మద్దతు ఇచ్చినా దానిపై మార్కెట్లో అంతో ఇంతో ఫాలోయింగ్ ఉంటుంది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది జంటగా నటిస్తున్న మోడ్రన్ డే రొమాంటిక్ డ్రామా దో దీవానే సెహెర్ మే చిత్రానికి నిర్మాతగా భన్సాలీ మద్దతునిస్తున్నారు. ఈ చిత్రం 20 ఫిబ్రవరి 2026న ప్రేమికుల దినోత్సం అనంతరం విడుదలకు సిద్ధమవుతోంది. ఇది భన్సాలీ జానర్ కంటే భిన్నమైనది. ఆయనలా భారీతనం నిండిన సెట్లలో సాగే ప్రేమకథా చిత్రం కాదు. ఇది లైఫ్ లో సాగే డ్రామా, ఎమోషన్స్ తో ముందుకు సాగే ఒక అందమైన ప్రేమకథ. బహుశా మృణాల్ ఇంతకుముందు నటించేసిన సీతారామం మాడ్యూల్ ని అనుసరిస్తుందనే భావన తాజాగా భన్సాలీ బృందం రిలీజ్ చేసిన యానిమేటెడ్ విజువల్ వెల్లడించిందిఇది నిజ జీవిత ప్రేమకథతో రూపొందిస్తున్న సినిమా అని కూడా చెబుతున్నారు. మృణాల్ ఈ చిత్రంలో తనదైన నటనతో మరోసారి అభిమానులను రంజింపజేస్తుందని అంచనా వేస్తున్నారు. సీతారామం, హాయ్ నాన్న తరహాలోనే ఈ కొత్త చిత్రం లైటర్ వెయిన్ సన్నివేశాలతో, ఘాడమైన ఎమోషన్స్ తో సాగుతుందని చెబుతున్నారు. ఇటీవల మృణాల్ కి సీతారామం రేంజులో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలలో అవకాశం లభించలేదు. ముఖ్యంగా హిందీ చిత్రాలలో తనకు ఎప్పుడూ అలాంటి స్కోప్ రాలేదు. ఇటీవలే విడుదలైన సన్ ఆఫ్ సర్దార్ 2లోను అంతగా ప్రాధాన్యత లేని రొటీన్ పాత్రలో కనిపించాల్సి వచ్చింది. హిందీ పరిశ్రమ చాలా కాలంగా తనను లైట్ తీస్కుంటూనే ఉంది. దీని కారణంగానే మృణాల్ చూపులు ఎప్పుడూ టాలీవుడ్ పైనే ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒక సీతారామం, ఒక హాయ్ నాన్న తనకు గొప్ప పేరు తెచ్చిన సినిమాలు. మళ్లీ అలాంటి గుర్తింపు బాలీవుడ్ లో ఎప్పటికి సాధ్యమవుతుందో కూడా చెప్పలేని పరిస్థితి. అందుకే ఇప్పుడు -దో దీవానే సెహెర్ మే- హిందీ చిత్రసీమలో తనకు తొలి పెద్ద గుర్తింపునిచ్చే సినిమా అవ్వాలని మృణాల్ కలలు కంటోంది. ఈ చిత్రానికి -మామ్- ఫేం రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన యానిమేటెడ్ ఫస్ట్ లుక్ కవితాత్మకమైన ట్యూన్ తో రక్తి కట్టించింది. ఇది శశాంక్ - రోష్నీ అనే అందమైన ప్రేమికుల జీవితానికి సంబంధిచిన కథ. అద్భుతమైన కళాత్మక డ్రామాతో రక్తి కట్టిస్తుందని భావిస్తున్నారు. భన్సాలీ మద్దతుతో వస్తున్న సినిమా గనుక మృణాల్ పాత్రకు ప్రత్యేకత ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## చరణ్ ఆస్తి 1370 కోట్లు- ఉపాసన ఆస్తి 1130 కోట్లు!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్- ఉపాసన దంపతులు అభిమానులకు ఇటీవలే 'డబుల్ ధమాకా ఫెస్టివల్' గురించి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ దంపతుల మొదటి సంతానం అయిన క్లిన్ కారా బుడి బుడి అడుగులతో వేగంగా ఎదిగేస్తోంది. మెగా - కామినేని కుటుంబాల్లో చిన్నారి క్లిన్ కారా గొప్ప కాంతులను తెచ్చింది. త్వరలోనే ఈ దంపతులు కవలలకు జన్మనివ్వబోతున్న వార్త ఇరు కుటుంబాలలో మరింతగా ఆనందాన్నిచ్చింది. అయితే ఇలాంటి ఆనందకర సమయంలో ఈ ఆదర్శ జంట నికర ఆస్తుల గురించి ఫిలింసర్కిల్స్ లో ఆసక్తికర చర్చ సాగుతోంది. రామ్ చరణ్ ఇప్పటికే టాలీవుడ్ అగ్ర హీరోగా తారాపథాన్ని ఏల్తున్నాడు. అతడు ఇప్పుడు పాన్ ఇండియన్ మార్కెట్లో తన స్థాయిని పెంచుకునే పనిలో ఉన్నాడు. ఒక్కో సినిమాకి సుమారుగా 75 కోట్లు పైగా ఆర్జిస్తున్నాడు. రెండు దశాబ్దాల కెరీర్ లో చరణ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. అయితే అతడు సినిమాలు, ప్రకటనల ఆదాయంతో పాటు వారసత్వంగా వచ్చిన సంపదలు కలుపుకుని దాదాపు 1370 కోట్ల నికర ఆస్తులను కలిగి ఉన్నాడని కథనాలొచ్చాయి. అలాగే ఉపాసన అపోలో గ్రూప్స్ సంస్థానంలో మేనేజ్ మెంట్ లో కీలక పాత్రల్ని అజేయంగా పోషిస్తున్న సంగతి తెలిసిందే. తన పదవులు, ఉద్యోగం నుంచి వచ్చే సంపాదనతో పాటు, వారసత్వ సంపదగా వచ్చే ఆస్తులను కలుపుకుని ఉపాసన వ్యక్తిగత నికర ఆస్తుల విలువ రూ. 1,130 కోట్లు. ఇది సుమారు 135 మిలియన్ అమెరికన్ డాలర్లుగా అంచనా. ఉపాసన వ్యాపార సంస్థలు.. తన ఉద్యోగం, కుటుంబ ఆస్తుల నుండి చాలా ఆస్తులను కలిగి ఉన్నారు. తన భర్త రామ్ చరణ్‌కు ఉన్న ఆస్తులు రూ. 1370 కోట్లు కలిపి మొత్తం రూ. 2,500 కోట్ల నికర ఆస్తితో భారతదేశంలో అసాధారణ నికర ఆస్తి విలువ ఉన్న జంటగా రికార్డులకెక్కారు. చరణ్- ఉపాసన దంపతుల నికర ఆస్తిని అమెరికన్ డాలర్లలో కొలిస్తే 300 మలియన్ డాలర్లకు సమానం. దాదాపు లక్ష కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఆరోగ్య సంరక్షణ రంగంలో దిగ్గజ గ్రూప్ గా పాపులరైన అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు బిలియనీర్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డికి ఉపాసన మనవరాలు అన్న సంగతి తెలిసిందే. లండన్ లో ఉపాసన ఎంబీఏ విద్యను అభ్యసించారు. మెగా కోడలు ఉపాసన అపారమైన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. చాలా కాలంగా మహిళల ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన గురించి ఉపాసన బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ లోని ప్రతిష్మాత్మక విద్యాసంస్థలో ఉపాసన స్పీచ్ చాలా పెద్ద చర్చకు తెర తీసింది. మహిళలు తమ అండాలను ఫ్రీజ్ చేసి దాచుకోవడం అతిపెద్ద భీమా! అని ఉపాసన ప్రకటించారు. తమకు నచ్చిన కెరీర్ ని ఎంచుకుని, నచ్చినప్పుడు పెళ్లాడి పిల్లల్ని కనొచ్చని సూచించారు. అయితే దీనిపై చాలా విమర్శల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

## కంగనా తరహాలో కీర్తి సురేష్ బిగ్ డ్రీమ్



సాధారణంగా హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ పెళ్లి తర్వాత స్లో అవుతుందని అంటారు. కానీ కీర్తి సురేష్ మాత్రం ఆ సెంటిమెంట్ కి చెక్ పెట్టేసింది. పెళ్లి తర్వాత ఆమె మరింత జోరుగా దూసుకెళ్తోంది. 'రివాల్వర్ రీటా' ప్రమోషన్స్ లో బిజీగా ఉన్న కీర్తి, తన మనసులో ఉన్న ఒక 'బిగ్ డ్రీమ్' గురించి ఓపెన్ అయ్యింది. అది కేవలం నటనకు సంబంధించినది కాదు, సినిమా మేకింగ్ కి సంబంధించిన ఒక పెద్ద కల. ఇప్పుడు ఇదే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. కీర్తి సురేష్ తన ఇంటర్వ్యూలో క్యాజువల్ గా చెప్పిన ఒక మాట ఏమిటంటే.. ఆమె సొంతంగా ఒక స్క్రిప్ట్ రాసుకుంటోందట. అవును, కీర్తికి డైరెక్షన్ చేయాలనే ఆసక్తి ఎప్పటి నుంచో ఉందట. కేవలం గ్లామర్ డాల్ గా మిగిలిపోకుండా, ఒక క్రియేటర్ గా తనను తాను ప్రూవ్ చేసుకోవాలని ఆమె బలంగా కోరుకుంటోంది. ఇది నిజమైతే, కంగనా రనౌత్ లాగా కీర్తి కూడా 'లేడీ డైరెక్టర్' గా మెగాఫోన్ పట్టుకునే రోజు ఎంతో దూరంలో లేదు. యాక్టింగ్ చేస్తూనే డైరెక్షన్ చేయడం అనేది కత్తి మీద సాము లాంటిది. అజయ్ దేవగన్, కంగనా లాంటి కొద్దిమంది మాత్రమే ఈ ఫీట్ ని సక్సెస్ ఫుల్ గా చేయగలిగారు. ఇప్పుడు కీర్తి కూడా ఆ లిస్ట్ లో చేరాలని చూస్తోంది. ఇది ఆమెలోని మల్టీ టాలెంటెడ్ యాంగిల్ ని చూపిస్తోంది. 'మహానటి'గా సావిత్రి గారి బయోపిక్ లో నటించి మెప్పించిన కీర్తి, ఇప్పుడు నిజ జీవితంలో కూడా సావిత్రి గారిలా డైరెక్షన్ వైపు అడుగులు వేస్తుండటం యాదృచ్ఛికమే అయినా ఆసక్తికరంగా ఉంది. ఇక పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడుతూ, తన భర్త సినిమాలకు దూరంగా ఉంటారని క్లారిటీ ఇచ్చింది. "ఆయన సినిమాల జోలికే రారు, నాతో నటించే ప్రసక్తే లేదు" అని నవ్వేసింది. ఇది చూస్తుంటే కీర్తి తన ప్రొఫెషనల్ లైఫ్ ని, పర్సనల్ లైఫ్ ని ఎంత బ్యాలెన్స్ గా మైంటైన్ చేస్తుందో అర్థమవుతోంది. భర్త సపోర్ట్ ఉన్నా, తన కెరీర్ ని తన సొంత కాళ్ల మీదే నిలబెట్టుకోవాలనే తపన ఆమెలో కనిపిస్తోంది. మరోవైపు మహిళల భద్రత గురించి కీర్తి చేసిన వ్యాఖ్యలు ఆలోచింపజేసేలా ఉన్నాయి.

## సినిమాలు ప్రజల్లో విద్వేషాన్ని పెంచకూడదు



తనదైన అందం, ప్రతిభతో సరిహద్దులు దాటి నిరూపించిన నటి హ్యూమా ఖురేషి. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ ఈ భామ సుపరిచితురాలు. ఇటీవల వరుస వెబ్ సిరీస్ లలో అద్భుత పాత్రలతో యువతరం హృదయాలను గెలుచుకుంటున్న హ్యూమా ఖురేషి తన ఎంపికలు ఎప్పుడూ విలువలతో కూడుకున్నవి అని ధృవీకరించింది. ఏదైనా సినిమా ప్రజల్లో ద్వేషాన్ని పెంచితే అది హానికరమైనది. ప్రజల సమస్యలను మనం పెంచకూడదు. వినోదాన్ని మాత్రమే పంచాలి! అని అన్నారు. తాను ఏదైనా స్క్రిప్టును ఎంచుకోవాలంటే కచ్చితంగా కొన్ని విలువలకు కట్టుబడి ఉంటానని హ్యూమా చెప్పకనే చెప్పింది. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్, మహారాణి, హీరా మండి ఒకటేమిటి కెరీర్ లో ఎన్నో ప్రయోగాలు చేసిన హ్యూమా, ప్రస్తుతం ఢిల్లీ క్రైమ్ సీజన్ 3లోను నటించింది. ఒక కథను ఎంపిక చేసుకుని సంతకం చేసే ముందు దానిపై నమ్మకం ఉంచాలా? అని అడిగినప్పుడు, పెద్ద చెక్కులు ఇస్తారు కదా! అంటూ జోక్ చేసింది. కానీ తనకంటూ కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయని చెప్పింది. ఏదైనా ఎంచుకోవడానికి డబ్బు ఒక్కటే ప్రామాణికం కాదని కూడా హ్యూమా వెల్లడించింది. తాను విలువలకు ఎలా కట్టుబడి ఉంటుందో హ్యూమా చెప్పకనే చెప్పింది. తన సిద్ధాంతాలతో అందరి హృదయాలను గెలుచుకుంది. నంబర్ల గేమ్ నడిచే పరిశ్రమలో విలువలకు కట్టుబడి ఉండేది చాలా తక్కువమంది. ఇప్పుడు హ్యూమా నిర్మాతగాను కొన్ని సినిమాలను విలువలకు కట్టుబడి నిర్మిస్తోంది. తాజా పాడ్ కాస్ట్ లో హ్యూమా తన తదుపరి రిలీజ్ గురించి మాట్లాడింది. నిర్మాతగా ఆవేదన... ఇటీవలే థియేటర్లలో విడుదలైన విమర్శకుల ప్రశంసలు పొందిన -ఆగ్రా- చిత్రానికి ప్రజల్లో సరైన ఆదరణ దక్కలేదని, తాను నిర్మించిన -సింగిల్ సల్మా- కూడా ఇలాంటి విధిని ఎదుర్కొందని తెలిపింది హ్యూమా. కను బెహ్ల్ తెరకెక్కించిన -ఆగ్రా చిత్రానికి విస్తృత ప్రశంసలు దక్కినా కానీ తగినన్ని స్క్రీన్‌లను పొందడంలో ఇబ్బంది పడింది. ఈ సమస్య దీనికి మాత్రమే కాదు చాలా మందికి ఇదే సమస్య. పరిమిత స్క్రీన్‌లు, వేకువ ఝాము షోలు తక్కువ మంది ప్రేక్షకులతో వీక్ డేస్ స్లాట్‌లను పొందుతున్నాయి.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com